# నమస్తే తెలంగాణ

# నల్లగొండ

5 | నల్లగొండ, సోమవారం 23 సెప్టెంబర్ 2024 | NALGONDA


## మూడు గేట్ల ద్వారా మూసీ నీటి విడుదల



కేతేపల్లి, సెప్టెంబర్ 22 : మూసీ ప్రాజెక్టు మూడు గేట్ల ద్వారా ఆదివారం దిగువకు నీటి విడుదల చేశారు. హైదరాబాద్‌లో కురుస్తున్న వర్షాల వల్ల శనివారం 1,825 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా ఆదివారం 4,400 క్యూసెక్కులకు పెరిగింది. ఇన్‌ఫ్లో పెరుగడంతో ప్రాజెక్టు నీటిమట్టం గరిష్ఠ స్థాయికి చేరుకుంది. ఈ నేపథ్యంలో అప్రమత్తమైన అధికారులు ప్రాజెక్టు 3 క్రస్టు గేట్లను ఎత్తి 4 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. కుడి కాల్వకు 123, ఎడమ కాల్వకు 317 క్యూసెక్కుల నీరు వెళ్తున్నది.



తొగర్రాయిలో వరద బాధితురాలకు నిత్యావసర సరుకులు అందించి మాట్లాడుతున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

## బాధితులకు అండగా నిలవడం మానవత్వం

**స్వేరోస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్**

**కోదాడలో వరద బాధితులకు నిత్యావసర సరుకుల అందజేత**

కోదాడ రూరల్, సెప్టెంబర్22 : ప్రకృతి వైపరీత్యాలు రావడం సహజమని, అదే సమయంలో వైపరీత్యాల బారినపడిన కుటుంబాలకు సేవా సంస్థలు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం అండగా నిలబడి సహకారాలు అందించి మానవత్వం చాటుకోవాలని స్వేరోస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆర్ ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఇటీవల భారీ వర్షాలు, వరదలకు నష్టపోయిన కోదాడ మండల పరిధి కూచిపూడి, తొగర్రాయి గ్రామాల్లోని బాధితులకు ఆయన సాయం చేశారు. 250 కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ.7వేల విలువ గల నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరినీ ఉన్నత స్థాయిలో నిలిపేది విద్య ఒక్కటేనని, తమ పిల్లల చదువుపై తల్లిదండ్రులు దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో స్వేరోస్ నెట్‌వర్క్ చీఫ్ కన్వీనర్ బల్గూరి దుర్గయ్య, నెట్‌వర్క్ వైస్ చైర్మన్ బాలప్రసాద్, రాష్ట్ర అధ్యక్షుడు చిలకబత్తిని వీరన్న, చెరుకుపల్లి కిరణ్, మచ్చ నర్సయ్య, మైలారం జగన్, వీరస్వామి, నాగార్జున, లక్ష్మణ్, సునీత, కనకతార, పద్మ, ధనమ్మ, అంబేద్కర్, శాంసన్ పాల్గొన్నారు.

# పెరిగిన సన్నాల సాగు



## రైతుల్లో ఆశలు రేకెత్తించిన కాంగ్రెస్ సర్కారు

ఈ వానకాలం సీజన్ నుంచి సన్నాలు సాగు చేసి ప్రభుత్వ రంగ సంస్థల్లో ధాన్యం విక్రయించిన అన్నదాతలకు క్వింటాకు రూ.500బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో నల్లగొండ జిల్లాలో రికార్డు స్థాయిలో సన్నాలు సాగయ్యాయి. సాధారణంగా ప్రతి వానకాలం సీజన్‌లో సాగైన వరిలో 70శాతం దొడ్డు, 30శాతం సన్న రకం ఉంటుంది. ఈ సారి అందుకు భిన్నంగా సాగైంది. జిల్లా వ్యాప్తంగా 5,10,196 ఎకరాల్లో వరి సాగు కాగా అందులో 2,41,410 ఎకరాల్లో దొడ్డు, 2,68,786 ఎకరాల్లో సన్నరకం ఉన్నది. సాధారణంగా 17శాతం తేమతో ఉన్న దొడ్డు ధాన్యం అయితే క్వింటాకు రూ.2,305, సన్నాలు అయితే మరో రూ.500 కలిపి రూ.2,805 మద్దతు ధర చెల్లించాల్సి ఉంది. ఇది రైతుకు కలిసి వచ్చే అంశమే అయినప్పటికీ ఇది అమలు జరుగుతుందా లేదా అనే మీమాంసలో అన్నదాతలు ఉన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత యాసంగిలో మాత్రమే రైతు బంధు వేసింది. ఈ వానకాలం సంబంధించి రైతు బంధు లేదు రైతు భరోసా లేదు. ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా రైతుల ఖాతాల్లో జమ కాలేదు. ఇక రుణమాఫీ కూడా అరకొర మాత్రమే కావటంతో ప్రభుత్వం బోనస్ ఇస్తుందా అనే దానిపై రైతులు డైలమాలో ఉన్నారు.

– నల్లగొండ, సెప్టెంబర్ 22

**ధాన్యానికి బోనస్ ఉంటుందా?.. అయోమయంలో అన్నదాతలు**

**గతేడాది 1,78,488 ఎకరాల్లో..**

**ఈ సారి 2,68,786 ఎకరాలకు పెరిగిన సన్నాల సాగు**

**అక్టోబర్ 1 నుంచి కొనుగోలు కేంద్రాల ఏర్పాటు**

**వానకాలంలో అందని రైతుబంధు.. అరకొరగానే రుణమాఫీ**



**బోనస్ ప్రకటనతో..**

కాంగ్రెస్‌ను రాష్ట్రంలో గెలిపిస్తే ధాన్యం క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించింది. అధికారంలోకి వచ్చిన తర్వాత మాటమార్చి సన్న ధాన్యానికి మాత్రమే బోనస్ ఇస్తామని అన్నది. దీనికి తోడు రేషన్ కార్డు దారులకు వచ్చే ఏడాది జనవరి నుంచి సన్న బియ్యం ఇస్తామని చెప్పింది. ఈ సీజన్ నుంచి సన్నాలు పండించిన రైతులకు మద్దతు ధరతోపాటు క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని తెలిపింది. ఈ నేపథ్యంలో జిల్లాలో ఈ సారి రికార్డు స్థాయిలో సన్న రకం వరి సాగు పెరిగింది. గతేడాది వానకాలం సీజన్‌లో 3,6,957 వేల ఎకరాల్లో దొడ్డు రకం, 1,78,488 ఎకరాల్లో సన్న రకం సాగు చేయగా, ఈ ఏడాది మొత్తం 2,68,786 ఎకరాల్లో సన్నాలు, 2,41,410 ఎకరాల్లో దొడ్డు రకం సాగు చేశారు.

### పథకాలు ఎగ్గొడుతున్న సర్కారు

అధికారంలోకి వస్తే ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు చేస్తామని కాంగ్రెస్ చెప్పింది. కానీ వాటిని గాలికి వదిలేసిన సర్కార్ మాటలు రైతులు నమ్మే పరిస్థితుల్లో లేకుండా పోయారు. రైతు భరోసా పేరుతో ఎకరాకు రూ.7500 ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం గత యాసంగికి సంబంధించింది మాత్రమే ఇచ్చింది. ఈ వానకాలం రైతు భరోసా ఊసేలేదు. ఇక ఆగస్టు15లోపు రూ.రెండు లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించి అరకొరగానే చేసి చేతులు దులుపుకొంది. జిల్లాలో ఇప్పటి వరకు 1.73లక్షల మంది రైతులకు మాత్రమే రూ.1,433 కోట్లు ఇవ్వటంతో ఇంకా 45వేల మంది రైతులు రుణమాఫీ ఇవ్వలేదని దరఖాస్తులు పెట్టుకున్నారు. పలు కారణాలతో వారికి రుణమాఫీ నిలిపేయగా ప్రస్తుతం సర్వే జరుగుతున్నది. రైతు భరోసా, రుణమాఫీ సరిగ్గా ఇవ్వని సర్కార్.. బోనస్ ఇస్తుందా లేదా అనేది రైతులు సందిగ్ధంలో ఉన్నారు.

### అక్టోబర్ 1 నుంచి కొనుగోలు కేంద్రాలు

జిల్లాలో ఈ వానకాలం సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలు చేయడానికి జిల్లా అధికార యంత్రాంగం కేంద్రాలు ఏర్పాటు చేస్తుంది. జిల్లా వ్యాప్తంగా డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఐకేపీ, సహకార శాఖ ఆధ్వర్యంలో పీఏసీఎస్‌లు, డీసీఎంఎస్ మార్కెటింగ్ శాఖల ఆధ్వర్యంలో గరిష్టంగా 400 కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకు సంబంధించి ఆయా కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలని జేసీ శ్రీనివాస్ ఆయా శాఖల అధికారులను ఇప్పటికే ఆదేశించారు. క్షేత్రస్థాయిలో శిక్షణ కార్యక్రమాలు ఈ నెల 25 తర్వాత చేపట్టనున్నారు.

**ఈ సారి 2.68 లక్షల ఎకరాల్లో సన్నాల సాగు**

జిల్లాలో ఎప్పుడూ లేని విధంగా ఈ సారి సన్నాలు 2.68 లక్షల ఎకరాల్లో సాగైంది. ప్రధానంగా ఆయకట్టు ప్రాంతంలో ఎడమ కాల్వకు నీటి విడుదల చేయడం వల్ల ఎక్కువ మంది రైతులు సన్నాలు వేశారు. అక్టోబర్1 నుంచి కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నాం. రైతులు తక్కువ ధరకు దళారులు, మిల్లర్లకు అమ్మి మోస పోకుండా ప్రభుత్వం ఇచ్చే మద్దత ధరను సద్వినియోగం చేసుకోవాలి.

**-పాల్వాయి శ్రవణ్ కుమార్, డీఏఓ, నల్లగొండ**

## బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు

**• మాజీ ఎమ్మెల్యే నోముల భగత్**





గుర్రంపోడులో పోలీసుస్టేషన్ ఎదుట మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నోముల భగత్

గుర్రంపోడు, సెప్టెంబర్ 22 : బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై పోలీసులు తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారని నాగార్జునసాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. గుర్రంపోడు పోలీసు స్టేషన్ ఎదుట ఆదివారం ఆయన కార్యకర్తలతో కలిసి మాట్లాడారు.

మొసంగి గ్రామానికి చెందిన చంటి అనే వ్యక్తి ల్యాండ్ విషయంలో పెద్ద మనిషిగా వెళ్తే అక్రమ కేసు బనాయించడంతోపాటు కోర్టులో కేసు ఉన్నప్పటికీ పొలంలో కంచె పాతించి అక్రమంగా నిర్బంధించారని తెలిపారు. మండలంలో ఎస్ఐ వ్యవహార శైలిపైన, ముల్కలపల్లిలో హత్యను కప్పిపుచ్చడం పైన పూర్తి విచారణ జరిగే విధంగా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు సింగం ప్రవీణ్, పల్లి అభినయ్ యాదవ్, వేముల యాదయ్య, ఐతరాజు నాగరాజు, వంగూరి మహేశ్ పాల్గొన్నారు.



బుద్ధ వనంలోని మహా స్తూపం వద్ద బైక్ రైడర్లు

## హైదరాబాద్ టు బుద్ధవనం

**• పర్యాటక శాఖ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ**

నందికొండ, సెప్టెంబర్ 22 : నాగార్జున సాగర్ హిల్‌కాలనీలోని అంతర్జాతీయ పర్యాటక కేంద్రం, బౌద్ధ వారసత్వ సంపద బుద్ధవనాన్ని బైక్ రైడర్లు ఆదివారం సందర్శించారు. నిర్వాణ రైడ్ పేరుతో హైదరాబాద్‌లో 250 బైకులతో కూడిన ర్యాలీని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, టూరిజం చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్, బుద్ధవనం ప్రత్యేకాధికారి ప్రకాశ్‌రెడ్డి ఆదివారం ఉదయం 7 గంటలకు జెండా ఊపి ప్రారంభించారు. బైక్ రైడర్లు మధ్యాహ్నం బుద్ధవనం చేరుకున్నారు. బుద్ధవనం చుట్టూ ఉన్న అవుట్ రోడ్డులో బైకులతో ర్యాలీ నిర్వహించి, బుద్ధవనంలోని జాతకపార్కు, అవకాన బుద్ధ, మహాస్తూపం, ధ్యానమందిరం సందర్శించారు. బుద్ధవనంలోని జాతకపార్కులో ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర పర్యాటక సంస్థ మార్కెటింగ్ జీఎం అంజిరెడ్డి, ట్రాన్స్‌పోర్టు జీఎం ఇబ్రహీం బైక్ రైడర్లకు ప్రశంసా పత్రాలను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణలోని చారిత్రక అంశాల ప్రాధాన్యత, విశిష్టతను అందరికీ తెలియజేయడానికి, తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ ఇటువంటి బైక్ రైడ్‌లను ప్రోత్సహిస్తుందన్నారు. టూరిజం ఆధ్వర్యంలో ప్రతి నెలా ఒక చారిత్రక ప్రాంతానికి వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బుద్ధవనం ఓఎస్‌డీ సుధాన్‌రెడ్డి, బుద్ధవనం నిపుణులు ఈమని శివనాగిరెడ్డి, సహాయ శిల్పి శ్యామ్‌సుందర్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమాల పర్వం ఆగేనా?

### ప్రభుత్వానికి పూర్తిస్థాయిలో చేరని కస్టమ్ మిల్లింగ్ రైస్



- **మిల్లుల్లో తనిఖీలు చేసినా బయటపడని మోసాలు**
- **తీరా ధాన్యం అమ్ముకున్న తర్వాత చర్యలు**
- **ఇప్పటికే పలు మిల్లులు సీజ్, కేసులు నమోదు**
- **అధికారులు అప్రమత్తం కాకుంటే మరింత నష్టం**

సూర్యాపేట, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ) : కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) కొంతమంది అక్రమార్కులకు వరంలా మారింది. ప్రభుత్వానికి ఇవ్వాల్సిన బియ్యాన్ని మిల్లర్లు బయట అమ్ముకొని సొమ్ముచేసుకుంటున్నారు. ఇందులో అధికారులను వాటాదారులుగా చేసుకుంటున్నారు. ఒక వేళ అక్రమాలు బయటపడినా కేసులు నమోదవడం, జైలుకెళ్లడం పరిపాటిగా మారింది. దాంతో ప్రభుత్వానికి భారీ నష్టం చేకూరుతున్నది. అధికారులు తూతూమంత్రంగా తనిఖీలు చేసి మిల్లర్లు ఇచ్చే మామూళ్లతోనే ఇలా జరుగుతున్నదని పలువురు ఆరోపిస్తున్నారు.

**తనిఖీలు చేసినా కట్టడి ఏది?**

కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన ధాన్యాన్ని ప్రభుత్వం కస్టమ్ మిల్లింగ్ కోసం మిల్లర్లకు అందజేస్తుంది. ఆ ధాన్యాన్ని మిల్లింగ్ చేసిన అనంతరం మిల్లర్లు తిరిగి ప్రభుత్వానికి అందిస్తారు. కానీ సూర్యాపేట జిల్లాలో కొంతమంది అక్రమార్కులు వందల కోట్ల విలువైన ధాన్యాన్ని పక్కదారి పట్టించి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వానికి సీఎంఆర్ ఇవ్వకుండా ఎగ్గొడుతున్నారు. ఇందులో 20 నుంచి 25 శాతం అధికారులకు ముట్టజెప్పుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మిల్లుల్లో ధాన్యం మాయమవుతున్నప్పటికీ తనిఖీలు చేసిన అధికారులు మాత్రం రిమార్కులు చూపించడం లేదు. తొలుత తిరుమలగిరిలోని రెండు మిల్లులను సీజ్ చేయగా, దానికి ముందు ఏడాది పాటు దాదాపు 14 సార్లు తనిఖీలు చేసినట్లు రికార్డులు ఉన్నాయి. కానీ ఏనాడూ తక్కువ ధాన్యం స్టాక్ ఉన్నట్లు చూపించలేదు. అంతేగాక ఆ రెండు మిల్లులపై కేసులు నమోదు చేసిన సమయంలో సుమారు రూ.20 కోట్ల ధాన్యం ఉంది. కానీ వాటిని స్వాధీనం చేసుకోలేదు. రెండు నెలల పాటు మిల్లులు నడిపి ఉన్న ధాన్యాన్ని అమ్ముకుంటుంటే మామూళ్లు తీసుకున్నారు తప్ప కట్టడి చేయలేదని పేరు బహిర్గతం చేయడానికి నిరాకరిస్తున్న మిల్లర్లు చెబుతున్నారు.

**పలు మిల్లులపై కేసులు**

తిరుమలగిరి మండలంలోని సోమనర్స య్యకు చెందిన రెండు రైస్ మిల్లుల్లో సుమారు రూ.180 కోట్ల విలువ చేసే ధాన్యం మాయమైనట్లు అధికారులు గుర్తించారు. అలాగే కోదాడ మండలం కొమరబండ వద్ద ఉన్న నీలా సత్యనారాయణకు చెందిన శ్రీవెంకటేశ్వర రైస్ ఇండస్ట్రీలో రూ.64 కోట్ల విలువ చేసే ధాన్యం, గరిడేపల్లి సమీపంలోని ఎంకేఆర్ మిల్లులో ధాన్యం మాయమైన తర్వాత కేసులు నమోదు చేశారు. మూడు రోజుల క్రితం తిరుమలగిరి మండలంలోని శ్రీలక్ష్మి ట్రేడర్స్, హర్షిత ట్రేడర్స్ రెండు మిల్లుల్లో రూ.40 కోట్ల ధాన్యం మాయమైందని హైదరాబాద్ నుంచి వచ్చిన టీములు సీజ్ చేసి కేసులు నమోదు చేశారు. దాదాపు నాలుగు నెలల క్రితమే ఈ రెండు మిల్లుల్లో ధాన్యం మాయమైందని మీడియాలో వచ్చింది. అప్పుడు అధికారులను అడిగితే అవునని చెప్పినా సీజ్ చేయకుండా, చర్యలు తీసుకోకుండా వదిలేశారు. నాలుగు నెలల క్రితం ఆ రెండు మిలుల్లో దాదాపు రూ.20కోట్లకు పైనే ధాన్యం ఉండగా వాటిని స్వాధీనం చేసుకోకపోవడంతో అవి కూడా మాయమయ్యాయి. ఆ తరువాత కేసులు నమోదు చేయడం పట్ల జిల్లాలోని మిల్లర్లు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే జిల్లాలోని మరో నాలుగైదు మిల్లుల్లో ప్రభుత్వం ఇచ్చిన ధాన్యం పెద్దఎత్తున మాయమైనట్లు తెలుస్తున్నది. అధికారులు స్పందించి అన్ని మిల్లుల్లో పూర్తిస్థాయిలో తనిఖీలు చేపడితే మరిన్ని అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉన్నది. తాత్సారం చేస్తే ఉన్న ధాన్యం కూడా విక్రయించుకున్న తర్వాత అధికారులు కేసులు నమోదు చేస్తే ఏం లాభం పలువురు పేర్కొంటున్నారు.

## ధరణి.. 'తిరస్కరణ'

# ధోరణి..

### ధరణి దరఖాస్తుల్లో తిరస్కరణల పర్వం

**వివిధ సాకులు చూపుతూ రిజెక్ట్ చేస్తున్న అధికారులు**

**జెన్యూన్ అప్లికేషన్లు కూడా వెరిఫై చేయకుండానే..**

**యాదాద్రి జిల్లాలో 8వేల ధరణి దరఖాస్తులు క్లియర్**

**అందులో సగం అప్లికేషన్లు తిరస్కరణ**

**డబ్బులు ఇస్తే ఒకలా.. ఇవ్వకుంటే మరోలా..?**

**అనేక విధాలుగా నష్టపోతున్న రైతులు**

**రైతుబంధు, రైతుబీమా, పంట రుణాలకు అనర్హులుగా..**



*ఈ ఫొటోలోని వ్యక్తి పేరు రూపని యాదమ్మ. గుండాల మండలంలోని అంబాల గ్రామం. ఆమె భర్త రూపని వీరయ్య పేరు మీద 4 ఎకరాల 20గుంట భూమి ఉంది. ఆమె భర్త గతంలోనే చనిపోయాడు. ఆ భూమికి ఆన్‌లైన్‌లో భర్త పేరు రావడంలేదు. సదరు ల్యాండ్ ఆమె పేరుపై పట్టా చేసుకునేందుకు మిస్సింగ్ సర్వే నంబర్ కింద 2023 మే 23న దరఖాస్తు చేసుకుంది. ఇందుకోసం ఆన్‌లైన్‌లో వేల రూపాయల చలానా కట్టింది. సదరు దరఖాస్తును తహసీల్దార్, ఆర్డీవో, అడిషనల్ కలెక్టర్ లాగిన్‌ల నుంచి అప్రూవ్ అయ్యింది. కానీ కలెక్టర్ లాగిన్ వద్ద రిజెక్ట్ చేశారు. భూమి ఏవిధంగా సంక్రమించదనే ప్రొసీడింగ్ లేదనే కారణంతో తిరస్కరించారు. కానీ 2013-14 పాత పహణీల్లో సైతం ఆమె భర్త పేరు చూపిస్తున్నది.*

*ఆలేరు మండలంలోని శారాజీపేటకు చెందిన రైతు బుర్ర మధు రైతు భూమి ధరణిలో మిస్సింగ్ సర్వే నంబర్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. అన్ని పత్రాలు సరిగ్గానే ఉన్నాయి. కానీ తహసీల్దార్ మాత్రం వెరిఫై చేయకుండా అప్లికేషన్‌ను రిజెక్ట్ చేశారు. అయినప్పటికీ రైతు మరోసారి దరఖాస్తు పెట్టుకున్నారు. మళ్లీ రిజెక్ట్ కొట్టారు. ఆర్ఎస్ఆర్ కారణంగా చూపించి తిరస్కరించారని బాధితుడు వాపోతున్నాడు.*

ధరణి
తెలంగాణ ప్రభుత్వం

**ధరణి దరఖాస్తులు పరిష్కారం కావడంలేదు. ఆన్‌లైన్ అప్లికేషన్లు ముందుకు సాగడంలేదు. ధరణిలో అధిక శాతం దరఖాస్తులను తిరస్కరిస్తున్నారు. అన్ని పత్రాలు సరిగ్గానే ఉన్నా వివిధ కారణాలతో రిజెక్ట్ చేస్తున్నారనే ప్రచారం జరుగుతున్నది. ఒక్కో రైతు అప్లికేషన్‌ను మూడు, నాలుగు సార్లు కూడా తిరస్కరించిన ఘటనలు ఉన్నాయి. దీంతో కర్షకులు అనేక విధాలుగా నష్టపోతున్నారు. పెద్ద సంఖ్యలో భూసమస్యలు అపరిష్కృతంగానే మిగిలిపోతున్నాయి.**

– యాదాద్రి భువనగిరి, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ)

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కొన్ని రోజులపాటు ధరణి సేవలను నిలిపేసింది. దీంతో కుప్పలు తెప్పలుగా దరఖాస్తులు పేరుకుపోయాయి. వీటిని పరిష్కరించేందుకు స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించారు. ఇందుకు కోసం ప్రత్యేకంగా టార్గెట్లను నిర్దేశించారు. వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలోనే తహసీల్దార్లు లక్ష్యాన్ని పూర్తి చేయడమే ధ్యేయంగా పెట్టుకున్నారు. జిల్లాలో ధరణి దరఖాస్తుల పరిష్కారంలో తిరస్కరణకు గురైనవే అధికంగా ఉంటున్నాయి. వివిధ కారణాలు చూపుతూ ఇష్టారాజ్యంగా రిజెక్ట్ చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రధానంగా జెన్యూన్ అప్లికేషన్లను కూడా తిరస్కరించినట్లు బాధితులు పేర్కొంటున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 8వేల దరఖాస్తులు క్లియర్ కాగా, ఇందులో 50శాతం వరకు రిజెక్ట్ చేశారు.

**వివిధ కారణాలు చూపుతూ..**

సాధారణంగా వారసత్వ బదిలీలు, మిస్సింగ్ డేటా కరెక్షన్, సర్వే నంబర్ మిస్సింగ్, నిషేధిత జాబితా, పీవోబీ, కోర్టు కేసులు, డీఎస్ పెండింగ్ తదితర అంశాల్లో ధరణిలో దరఖాస్తు చేసుకుంటారు.అయితే రెవెన్యూ అధికారులు దరఖాస్తులను తిరస్కరిస్తే.. అందుకు గల కారణాలను సదరు కాలమ్‌లో పొందుపర్చాల్సి ఉంటుంది. దీంతో అధిక శాతం మంది అధికారులు ఆర్ఎస్ఆర్ సాకుగా చూపిస్తూ రిజెక్ట్ చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో కలెక్టర్ లాగిన్‌లో కూడా దరఖాస్తులు తిరస్కరణ గురువుతున్నట్లు తెలుస్తున్నది. రెవెన్యూ ఉన్నతాధికారులు మాత్రం లాంగ్ పెండింగ్, నిబంధనల ప్రకారం లేకుండా, సరైన పత్రాలు లేకపోవడంతోనే తిరస్కరించినట్లు చెబుతున్నారు. కాగా జిల్లాలో ఇంకా 4వేలు అప్లికేషన్లు పెండింగ్‌లో ఉన్నాయి. భూబాధితులు మళ్లీ దరఖాస్తు చేసుకుంటుండటంతో అప్లికేషన్లు పేరుకుపోతున్నాయి.

### డబ్బులు ఇవ్వకుంటే రిజెక్ట్..!

జిల్లాలోని రెవెన్యూ కార్యాలయాల్లో బహిరంగంగానే అవినీతి రాజ్యమేలుతున్నది. డబ్బులు ఇవ్వకుంటే ఏ పని కూడా ముందుకు జరగడం లేదు. చేయి తడిపితే మాత్రం జెట్ స్పీడ్‌తో ముందుకెళ్తుంది. ధరణి విషయంలోనూ డబ్బులు ఇస్తే పని అవుతున్నదని, లేకుంటే ఫైల్ రిజెక్ట్ కొడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ధరణి దరఖాస్తుల పరిష్కారానికి తహసీల్దార్ రిపోర్ట్ తప్పనిసరి కావడంతో ఇదే అదనుగా కొందరు అధికారులు కింది స్థాయి సిబ్బందితో కుమ్మక్కై జోరుగా వసూలుకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.



*హుజూర్‌నగర్ రూరల్ : బూరుగడ్డ చెరువుకు పడిన గండి*

## బూరుగడ్డ చెరువుకు మళ్లీ గండి..

# నిలిచిన రాకపోకలు

హుజూర్‌నగర్ రూరల్, సెప్టెంబర్ 22 : సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలంలోని బూరుగడ్డ గ్రామ నల్లచెరువుకు శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మళ్లీ గండి పడింది. గత నెల 24న కురిసిన వర్షాలతో వరద ప్రవాహానికి నల్లచెరువుకు గండి పడటంతో గోపాలపురం- బూరుగడ్డ గ్రామాల మధ్యగల రోడ్డు కొట్టుకుపోయింది. దాంతో పదిరోజుల పాటు రాకపోకలు నిలిచిపోయి సమీప గ్రామాల ప్రజలు ఇబ్బంది పడ్డారు. మంత్రి ఉత్తమ్ ఆదేశాలతో ఆ తర్వాత అధికారులు తాత్కాలికంగా రోడ్డును ఏర్పాటు చేసి రాకపోకలను పునరుద్ధరించారు. కాగా శనివారం కురిసిన వర్షపు నీటితో పాటు నాగార్జున సాగర్ జలాలు వచ్చి చేరడంతో వరద పెరిగింది. చెరువు కట్ట తెగిపోయే ప్రమాదం ఉండటం వల్ల చెరువు కట్టను జేసీబీతో కొంత భాగాన్ని తొలగించి గండి పెట్టి నీటిని దిగువకు వదిలారు. దాంతో గండి పెరిగి కరక్కాయలగూడెం, మాచవరం, బూరుగడ్డ గ్రామాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నియోజకవర్గ కేంద్రానికి రావాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని సమీప గ్రామాల ప్రజలు వాపోతున్నారు. అధికారులు సాధ్యమైనంత త్వరగా చెరువు కట్టకు మరమ్మతులు చేసి రాకపోకలను పునరుద్ధరించాలని కోరుతున్నారు.